ప్రజాశక్తి
గురువారం 16 మార్చి 2023
5
పార్వతీపురం మన్యం



హైకోర్టు తీర్పుపై ప్రభుత్వ ఉద్యోగుల సంఘం హర్షం

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వ ఉద్యోగ సంఘాలపై హైకోర్టు బుధవారం ఇచ్చిన తీర్పుపై జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు, కురుపాం సబ్‌ట్రెజరీ ఎస్‌టిఒ కె.శంకరరావు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు కురుపాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఎపి ప్రభుత్వం నిర్వహించే సమావేశానికి ఉద్యోగ సంఘాలను ఆహ్వానించకపోవడంపై ఎపి ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు సూర్యనారాయణ హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై నిర్వహించే సమావేశానికి ఉద్యోగ సంఘాలు తప్పకుండా పిలవాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు.

సాగునీటి రంగానికి.. నిధులు కేటాయించేనా?

తోటపల్లి, రామతీర్థసాగర్ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ గడప దాటడం లేదు. ఏటా రూ.వందల కోట్లు గుమ్మరిస్తున్నట్టు బడ్జెట్ సమావేశాల్లో చెప్తున్నప్పటికీ ఆచరణలో అందుకనుగుణంగా నిధులు విడుదల చేయడం లేదు. ఈ ఏడాది ఈ రెండు ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో, సర్దార్ గౌతులచ్చన్న తోటపల్లి బ్యారేజీ సాగునీటి లక్ష్యం 55శాతం వద్ద నిలిచిపోయింది. రామతీర్థసాగర్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గురువారం జరగనున్న బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వం జనవరి నెలలోనే నీటిపారుదల శాఖను ప్రతిపాదనలు కోరింది. ఎప్పటి మాదిరిగానే ప్రతిపాదలకే పరిమితమౌతుందా? లేక పాలనలో చివరి ఏడాదైనా నిధులు కేటాయింపు, విడుదలతో ఉదారంగా వ్యవహరిస్తుందా? అన్న సందేహంతో రైతాంగం ఎదురు చూస్తోంది.



అసంపూర్తిగా వదిలేసిన తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు

- బిల్లులు అందక పనులు నిలిపివేసిన తోటపల్లి కాంట్రాక్టర్
- 59 వేల ఎకరాలకు అందని సాగునీరు
- రామతీర్థసాగర్‌కు గతేడాది విడుదల చేయని ప్రభుత్వం
- పడకేసిన జలాశయం, కాలువ పనులు
- జంఝావతి, వెంగళరాయ, పెదంకలాం, పెద్దగెడ్డ, ఆండ్ర, తాడిపూడిలోనూ అదే తీరు
- నేడు రాష్ట్ర బడ్జెట్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో 64వేల ఎకరాల సాగునీటిని స్థిరీకరిస్తూనే విజయనగరం జిల్లాను కలుపుకుని సుమారు 1,31,221 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2004లో తోటపల్లి బ్యారేజీని తలపెట్టిన విషయం విధితమే. ఇప్పటి వరకు రూ.891కోట్లు ఖర్చు చేసినప్పటికీ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల అంచనా వ్యయం ఏటా పెరిగిపోతోంది. వైసిపి అధికారంలో వచ్చాక సాగునీటి కేటాయింపులు పరిశీలిస్తే 2019-20 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.156కోట్లు కేటాయించగా, ఆచరణలో రూ.13.64కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. 2020-21లో రూ.225.57కోట్లు కేటాయించగా రూ.37.27 కోట్లు చెల్లించింది. 2021-22లో 199.70కోట్లకుగాను రూ.1.35కోట్లే ఇచ్చింది. 2022-23లో రూ.126.61కోట్లు కేటాయిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో రూ.4.26కోట్లు మాత్రమే కేటాయించింది. మరోవైపు పని బిల్లులు రూ.4.23కోట్లు, ఇంటర్ లింకింగ్ పనులకు రూ.1.64కోట్లు, భూ సేకరణకు 21లక్షలు చొప్పున సుమారు రూ.6.37కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. పిల్ల కాలువలు, మదుములు, స్ట్రక్చర్లు, లైనింగ్ పనులు పెండింగ్‌లో వున్నాయి. మరో 291.48ఎకరాల భూమి సేకరించాల్సింది. వీటన్నింటికీ కలిపి రూ.500కోట్లు అవసరమౌతుందని ప్రాజెక్టు అధికారులు అంచనా వేశారు. నిధులు విడుదల విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేస్తుండడంతో తోటపల్లి సాగునీటి లక్ష్యం నీరుగారుతోంది. పెండింగ్ పనుల వల్ల 58,757ఎకరాలకు సాగునీరు అందడం లేదు.

24 వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం ప్రజల దాహార్తి తీర్చేందుకు తలపెట్టిన రామతీర్థసాగర్ ప్రాజెక్టుకు గత ఏడాది (2022-23)లో 124.50కోట్లు కేటాయిస్తామంటూ బడ్జెట్ సమావేశంలో చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. 2021-22లో రూ.201కోట్ల కేటాయింపునకుగాను విడుదల చేసింది కేవలం రూ.28.49కోట్లే. అంతకు మునుపు కూడా తోటపల్లి మాదిరిగానే అరకొర బడ్జెట్ కేటాయించింది. ఇటువంటి కారణాల వల్ల రూ.220 కోట్లతో తలపెట్టిన ఈ ప్రాజెక్టు అంచనా విలువ 2020 ఏప్రిల్ నాటికి 739.9కోట్లకు పెరిగిపోయింది. ఇప్పటి వరకు ఖర్చుచేసింది రూ.281.51కోట్లు మాత్రమే. ఈ నిధులతో బ్యారేజీ పని 90శాతం, జలాశయం పనులు 60శాతం, కాలువల పనులు 6శాతం పూర్తయ్యాయి. మిలుగు పనులు, 350ఎకరాల మేర భూసేకరణ, ఆర్అండ్ఆర్‌కు మరో 458.38కోట్లు అవసరమౌతాయని ప్రాజెక్టు అధికారులు ఏటా నివేదికలు పంపుతునే ఉన్నారు. ప్రభుత్వం మాత్రం కంటితుడుపు కేటాయింపులు చేస్తోంది. దీంతో, అటు తోటపల్లి, ఇటు రామతీర్థసాగర్ ప్రాజెక్టులు పూర్తికావడం లేదు. ఈ నేపథ్యంలో ఏటా కేటాయింపులు తప్ప నిధుల విడుదల ఏదీ అంటూ చర్చసాగుతోంది. జంఝావతి, వెంగళరాయ, పెదంకలాం, పెద్దగెడ్డ, ఆండ్ర, తాడిపూడి తదితర జలాశయాల్లోనూ ఇదే తీరు కనిపిస్తోంది. వీటి ఆధునీకరణకు జైకా నిధులు మినహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్దగా సహకారం అందడం లేదు. దీంతో, ఉన్న ఆయుకట్టును స్థిరీకరించుకోవడం కూడా కష్టతరడం మారింది. గుర్ల గెడ్డ సహా పలు చోట్ల తలపెట్టిన మినీ రిజర్వాయర్లు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఈనేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్‌లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తుందన్న ఆశతో రైతాంగం ఎదురు చూస్తోంది.

నేడే పట్టభద్రుల తీర్పు

- ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ఇనీషియల్ కౌంటింగ్‌కు 8 గంటలు
- తొలి ఫలితానికి ఒక రోజు సమయం
- 28 టేబుళ్లపై లెక్కింపు
- 500 పైచిలుకు కౌంటింగ్ సిబ్బంది



కౌంటింగ్ ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి తీర్పు వెలువడే సమయం వచ్చేసింది. ఈ నెల 13న జరిగిన పోలింగ్ ఫలితాల కోసం కౌంటింగ్ గురువారం ప్రారంభం కానుంది. ఓటరు తీర్పు ఎలా ఉంటుందన్న ఉత్కంఠ ఉత్తరాంధ్ర అంతటా నెలకొంది. విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లన్నింటినీ విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ చూస్తున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు 2 లక్షలా 926 ఓట్లు పోలయ్యాయి. వీటి లెక్కింపునకు 29 టేబుళ్లను స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఒక రౌండ్‌కి 1000 ఓట్ల ఫలితాన్ని సిబ్బంది లెక్కిస్తారు. ప్రారంభ కౌంటింగ్ అయ్యేసరికి 8 గంటల సమయం పడుతుంది. తొలి ఫలితంతో దాదాపు ఒక అంచనాకు రావొచ్చు. పూర్తిగా ఫలితం రాబట్టేందుకు ఒక రోజు వ్యవధి పడుతుందని అధికారులు చెబుతున్నారు.

విజేత నిర్ణయం ఎలా ?

పోలైన ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు అధికంగా ఒక అభ్యర్థికి వస్తే వారిని విజేతగా రిటర్నింగ్ అధికారి ప్రకటించవొచ్చు. 8 రౌండ్ల ఇనీషియల్ కౌంటింగ్ తర్వాత ఆపై ఎన్ని రౌండ్లు ఎలిమినేషన్ ఉంటుందో చెప్పలేని పరిస్థితి. 37 మంది అభ్యర్థులు ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బరిలో ఉండగా ప్రధాన పోటీ పిడిఎఫ్, వైసిపి, టిడిపి మధ్య ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నాలుగో స్థానంలో బిజెపి ఉంటుంది. రౌండ్ల వారీగా ఎన్ని ఓట్లు ఏ అభ్యర్థికి వస్తాయన్నదానిపైనా విజయం ఆధారపడి ఉంటుంది. ప్రాధాన్యతా క్రమంలో ఓటరు అభ్యర్థికి ఓటు వేసే అవకాశం ఉండడంతో ఆ ఓట్ల లెక్కింపు వల్ల సమయం ఎక్కువ పడుతుంది. ఈ ప్రాధాన్యతా క్రమంలో చివర ఉన్న అభ్యర్థులు ఎలిమినేషన్ అవుతూ ఉంటారు. రెండో ప్రాధాన్యతా ఓటుపైనే విజయం ఈ ఎన్నికల్లో ఆధారపడి ఉంటుందన్నది పలువురి నోట వినిపిస్తోంది. ఉత్తరాంధ్రలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యతా ఓటుతో గెలుపొందిన వారెవరూ 2007 నుంచి ఇప్పటివరకూ లేరు. ఈ దఫా కూడా ఇదే ఫార్ములా ఉంటుందన్నది భావిస్తున్నారు. అందుకే రెండో ప్రాధాన్యత ఓటు కీలకం కానుంది.

పిడిఎఫ్ గెలుపుపై అంచనా

శాసన మండలి ఎన్నికల ఫలితాలు, విజయావకాశాలపై ఇప్పటికే ఉత్తరాంధ్ర అంతటా చర్చోపచర్చలు జోరుగానే సాగుతున్నాయి. ప్రచారంలో 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ముందున్నారు. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వర్గాలు, సిబ్బంది నివేదికలు, ఓటర్ల మాటలను పరిశీలిస్తే రమాప్రభ ప్రభంజనమే సర్వత్రా ఉంటుందని పలువురు చెబుతున్నారు. టీచర్లు, ఉద్యోగులు, నిరుద్యోగుల విషయంలో రాష్ట్రంలోని అధికార వైసిపి సర్కారు నిర్బంధ వైఖరితో ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు పడిందన్నది పై నివేదికల సారాంశం. తెలుగుదేశం, బిజెపిలకు వారివారి పార్టీలకు చెందినవారి ఓట్లు పడినప్పటికీ పిడిఎఫ్‌కు వారు రెండో ప్రాధాన్యత ఓటు వేసినట్టు తెలుస్తోంది.



రూ.3.28 కోట్ల పన్ను బకాయిలున్న జిల్లా ఆస్పత్రి

మున్సిపాలిటీపై పన్నుల గుదిబండ

- ప్రభుత్వ కార్యాలయాల బకాయిలే రూ.6.46 కోట్లు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

2022-23వ ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీకి పన్నుల బకాయిలు గుదిబండలా తయారయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాల పన్నుల బకాయిలే రూ.6.46 కోట్లు ఉండటం గమనార్హం. అందులో ముఖ్యంగా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి సంబంధించి 3.28 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఈ మేరకు బుధవారం మున్సిపల్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ జె.రామ అప్పలనాయుడు పన్నుల బకాయిల వివరాలను వెల్లడంచారు. పోలీస్ షాపింగ్ కాంప్లెక్స్, తాలూకా పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, రైతు బజార్, తహశీల్దార్, ఎంపిడిఒ, సబ్ కలెక్టర్, విద్యుత్, హెడ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయాలు, టౌన్, బెలగాం రైల్వే స్టేషన్లు, తదితర కార్యాలయాల నుంచీ పన్నుల బకాయిలు రావాల్సి ఉందన్నారు. పట్టణంలోని 30 వార్డులలో నివాసాలు, వాణిజ్య సముదాయాల, ఖాళీ స్థలాల పన్నులు, ప్రకటన పన్నుల కలిపి రూ.4.06 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా, ఇంతవరకు రూ.3.08 కోట్లు వసూలైనట్లు చెప్పారు. ఈ నెలాఖరులోగా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల పన్నుల బకాయిలను మున్సిపాలిటీకి చెల్లించేందుకు ఆయా కార్యాలయాల అధికారులు చర్యలు చేపట్టి, మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తొలిరోజు 1436 మంది గైర్హాజరు • విజయనగరంలో ఇద్దరు విద్యార్థులు డిబార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంటర్ మొదటి ఏడాది పరీక్ష బుధవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 78 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 25825 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 24,389 మంది హాజరయ్యారు. 1436 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9 గంటలకు పరీక్ష సమయం కావడంతో 8 గంటలకే విద్యార్థులంతా కేంద్రాలకు చేరుకున్నారు. వారితో పాటు తల్లి తండ్రులు కూడా పిల్లల్ని పరీక్ష కేంద్రాలు వద్ద కు తోడ్కొని వచ్చి బాగా పరీక్ష రాయాలని శు భాకాక్షల తెలిపారు. ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో కాస్తా ఆలస్యంగా వచ్చిన వారంతా ఉరుకులు, పరుగులతో కేంద్రాల్లోకి వెళ్లారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు , కాలేజీ సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు లేకుండా తనిఖాలు చేపట్టి లోపలకు పంపించారు. విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను అధికారులు డిబార్ చేశారు. ఈ సందర్భంగా అర్ఐఒ ఎం.సత్యన్నారాయణ మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు. తొలి రోజు 53 కేంద్రాలను తనిఖీ బృందాలు పరిశీలించాయన్నారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులు

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరాతీశారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులకూ గురికాకుండా చూడాలన్నారు. పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడకుండా సిబ్బంది తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిఒ డివిటి నాయుడు, ప్రిన్సిపల్ బి.రేణుక, ఎస్ఐ కె.నీలకంఠం, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షా కేంద్రంలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ నిశాంత్

తొలిరోజు 6,613 మంది హాజరు

పార్వతీపురం మన్యం జిల్లాలో తొలి రోజుపరీక్షకు 4506 మంది సాధారణ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 4251 మంది హాజరయ్యారు. 255 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 2702 మంది హాజరు కావాల్సి ఉండగా 2362 మంది హాజరయ్యారు. 340 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 6,613 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

నిండు గర్భిణీ పరీక్షకు హాజరు

పరీక్షా కేంద్రంలో పురిటినొప్పులు.. ఆస్పత్రికి తరలింపు

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో పట్టణంలోని కొత్తవలసకు చెందిన గర్భిణీ పాలవలస దేవి (22) పరీక్షకు హాజరైంది. దేవి ఒక ప్రైవేటు ఒకేషనల్ కళాశాలలో వెటర్నరీ డెయిరీ ఒకేషనల్ కోర్సు చదువుతోంది. తొమ్మిది నెలల గర్భిణీ అయిన ఆమె తొలిరోజు జనరల్ ఫౌండేషన్ పేపర్ పరీక్ష రాస్తుండగా పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే ప్రిన్సిపల్ ఆకులరాజు సంబంధిత అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వారి అనుమతితో ఆమెను వెంటనే 108 వాహనంలో జిల్లా అసుపత్రికి తరలించారు. సూపరింటెండెంట్ ఆమెను వైద్యుల పరిశీలనలో ఉంచి చికిత్స అందించారు. ఎక్కువ సేపు ఒకేలా కూర్చోవడంతో స్వల్పంగా నొప్పులు వచ్చాయని, ఇంకా డెలివరీకి రెండు రోజులు సమయం పడుతుందని వైద్యులు తెలిపారు.



ఆస్పత్రిలో ఉన్న గర్భిణీ పాలవలస దేవి



వీరఘట్టం.. విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

వికలాంగులకు తప్పని సదరం కష్టాలు

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని వికలాంగులకు పింఛను కోసం సదరం శిబిరాలు ఏర్పాటుచేసి సర్టిఫికెట్ జారీ చేస్తోంది. అంతవరకూ బాగానే ఉన్నా, ఆచరణలో వికలాంగులకు కష్టాలు తప్పడం లేదు. సచివాలయంలో వికలాంగుల సదరం స్లాట్ నమోదు విషయంలో జరుగుతున్న పొరపాట్లే అందుకు కారణం. సదరం శిబిరం నిర్వహించే ఆస్పత్రుల్లో సంబంధిత వైద్యులు ఉన్నారో, లేరో తెలియకుండా స్లాట్ బుక్ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తీరా ఆస్పత్రికి వచ్చాక సంబంధిత వైద్యులు లేకపోవడంతో వికలాంగులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి బుధవారం సదరం శిబిరం నిర్వహిస్తున్నారు. విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలానికి చెందిన బొత్స రాము, లక్ష్మి దంపతుల కుమారుడు బి.ద్రోణ (12) కంటి సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో సదరం శిబిరంలో సర్టిఫికెట్ కోసం మెరకముడిదాం సచివాలయంలో స్లాట్ బుక్ చేయగా, కురుపాం సిహెచ్‌సికి కేటాయించారు. తీరా బుధవారం ఇక్కడకు వచ్చేసరికి కంటికి సంబంధించి వైద్యులు లేరని, సదరంలో చూడరని చెప్పడంతో కుమారుడిని తీసుకుని తల్లిదండ్రులు నిరాశతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమది పేద కుటుంబమని చెప్పారు. కుమారుడికి సర్టిఫికెట్ వస్తే పింఛను మంజూరవుతుందని, అది కాస్తా కుటుంబ పోషణకు ఉపయోగపడుతుందని ఆశ పడ్డామని తెలిపారు. అదే ఆశతో చాలా దూరమైనా రూ.2 వేలిచ్చి ఆటోను బుక్ చేసి కురుపాం వచ్చామన్నారు. సదరం శిబిరంలో కంటికి సంబంధించిన వైద్యాధికారి లేరని, మళ్లీ సచివాలయంలో స్లాట్ బుక్ చేసుకోవాలని సిబ్బంది చెప్పారని వాపోయారు. అధికారులు స్పందించి తమ కుమారుడికి పింఛను అందించి, ఆదుకోవాలని కోరారు.



కుమారుడు ద్రోణతో తల్లి లక్ష్మి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పంచాయతీరాజ్ ఉద్యోగులు

పంచాయతీరాజ్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి కలెక్టరేట్

ఎపిజెఎసి పిలుపులో భాగంగా బుధవారం మన్యం జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయ ఆవరణలో పిఆర్ ఉద్యోగులు నల్ల బాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షులు బి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి జి.చంద్రమౌళి మాట్లాడుతూ పిఎఫ్, జీత భత్యాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. మార్చి 30 వరకు నల్ల బాడ్జీలు ధరించి విధులకు హాజరౌతామని తెలిపారు. ఈలోగా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నామని, లేదంటే భవిష్యత్తు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ, డిఇఇ ఎం.రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం చేయాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఏప్రిల్ మూడో తేది నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అన్నారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో బుధవారం విద్యా సంబంధిత అంశాలపై ఎంపిడిఒలు, ఎంఇఒలతో పిఒ సమీక్షించారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసే విధంగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. విద్యార్థులు వెనుకబడి ఉన్న సబ్జెక్టులను గుర్తించి తగిన తర్ఫీదు ఇవ్వాలని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో బడి బయట పిల్లలు ఎవరూ ఉండరాదని చెప్పారు. జగనన్న గోరు ముద్ద పథకం ద్వారా సంపూర్ణ పౌష్టికాహారం విద్యార్థులకు అందాలన్నారు. ముఖ్యంగా బాలికల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని చెప్పారు. రక్తహీనతతో ఉన్నవారి పట్ల దృష్టిసారించాలని ఆదేశించారు. విద్యా హక్కు చట్టం కింద ప్రయివేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదలకు కేటాయింపుపై పర్యవేక్షణ విధిగా చేయాలని సూచించారు. పాఠశాలల్లో బైజూస్ బోధన పరిశీలించాలని, విద్యార్థులకు ప్రామాణిక విద్య అందాలని అన్నారు. నాడు-నేడు పనులపై దృష్టి సారించాలని, సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఒ ఎస్.డి.వి.రమణ, డిప్యూటీ డిఇఒ పి.బ్రహ్మాజీరావు, టిపిఎంయు ఎపిడి వై.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

వన్డే మ్యాచ్‌కి స్కోరర్‌గా విజయ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 19న భారత్, ఆస్ట్రేలియా మధ్య విశాఖలోజరగనున్న అంతర్జాతీయ వన్డే క్రికెట్ మ్యాచ్‌కు స్కోరర్‌గా విజయనగరానికి చెందిన వివిసి స్కోరర్ తోట విజయ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆంధ్ర క్రికెట్ సంఘం ప్రకటించింది. ఇప్పటి వరకు విజయ్ 9 వన్ డే మ్యాచ్ లు, నాలుగు 20-20 మ్యాచ్‌లు, 2 టెస్ట్ మ్యాచ్ లు, 13 ఐపిఎల్ మ్యాచ్ లకు స్కోరర్‌గా బాధ్యతలు నిర్వహించారు. విజయ్ 350 పైగా మ్యాచ్ లకు అంపైర్ గా కూడా వ్యవహరించారు. తన అభివృద్ధి వెనక తన కుటుంబం, జిల్లా సంఘం పెద్దల సహకారం ఎంతో ఉందని తెలిపారు.

17 నుంచి అగ్నివీర్ వాయు రిజిస్ట్రేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

అగ్నిపథ్ స్కీంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవటం ద్వారా యువత త్రివిధదళాల జీవితంలో స్థిరపడొచ్చని సెట్విజ్ సిఇఒ రామ్ గోపాల్ తెలిపారు. అగ్నివీర్ వాయు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. అగ్నివీర్ వాయు పరీక్ష ద్వారా ఎయిర్ ఫోర్స్‌లో చేరి తమ సేవలను దేశానికి అందించేందుకు యువతకు ఇదొక సువర్ణావకాశమని తెలిపారు. మార్చి 17 నుంచి 31 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. 2002 డిసెంబర్ 26 నుంచి 2006 జూన్ 26 మధ్యలో జన్మించిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కేవలం అవివాహిత యువతీ, యువకులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించటం ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుందని, మే 20వ తేదీ నుంచి ఆన్‌లైన్ పరీక్షలు ఉంటాయని వివరించారు. ఇంటర్ విద్యార్హత ఉండాలని, మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్టులు లేదా మూడు సంవత్సరాల డిప్లొమా ఇంజినీరింగ్, రెండు సంవత్సరాల ఒకేషనల్ కోర్సులు చదివిన యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు https://agnipathvayu.cdac.in వెబ్ సైట్ ద్వారా పూర్తి వివరాలు పొందవచ్చని, ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

భద్రాచలానికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - విజయనగరం కోట

శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 29న విజయనగరం నుంచి భద్రాచలానికి ప్రత్యేక అల్ట్రా డీలక్స్ బస్ సర్వీసును ఏర్పాటు చేసినట్లు ఆర్‌టిసి విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ బస్సు 29వ తేదీ సాయంత్రం 4.30గంటలకు విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి బయలుదేరి గురువారం ఉదయం 5గంటలకు భద్రాచలం చేరుతుందని తెలిపారు. తిరిగి ఆదివారం (30వ తేదీ) సాయంత్రం 5గంటలకు భద్రాచలం నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 5.30 లకు విజయనగరం చేరుకుంటుందని తెలిపారు. టిక్కెట్ ధర పెద్దలకు రూ.840, పిల్లలకు రూ.455గా నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్లు కావలసినవారు ఆర్టీసీ కాంప్లెక్స్ నందు రిజర్వేషన్ కౌంటర్ లో గానీ, WWW.APSRTCONLINE.IN వెబ్ సైట్ ద్వారా గానీ అడ్వాన్సు రిజర్వేషన్ చేసుకోవాలని తెలిపారు.

తాగునీటి కొరత నివారణకు చర్యలు

ప్రజాశక్తి - బొబ్బిలి

ఉమ్మడి జిల్లాలో వేసవిలో తాగునీటి కొరతను నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణామూర్తి అన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీకు తాగునీరు సరఫరా చేసే భోజరాజపురం ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో రాజాం, పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, పార్వతీపురం మున్సిపాలిటీలో తాగునీటి సమస్య లేదన్నారు. మిగిలిన మున్సిపాలిటీలలో తాగునీటి సమస్య ఉందని, నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బొబ్బిలి వేగావతిని ఉపయోగించటంతో బొబ్బిలికు తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. పెద్దగెడ్డ నీరు విడుదల చేసేందుకు సంబంధిత డిఇతో మాట్లాడినట్లు చెప్పారు.

నూతన పైపులైన్ కాంట్రాక్టర్ తో సమీక్ష

బొబ్బిలి పట్టణానికి తాగునీరు సరఫరా చేసేందుకు సువర్ణముఖినది నుంచి నూతన పైపులైన్ కాంట్రాక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పైపులైన్ మార్చాలని సూచించారు. ఏడాదిలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా గంటి

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది గంటి గోపాలకృష్ణ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోర్టులో బుధవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్షులుగా గంటి గోపాలకృష్ణశర్మ, కార్యదర్శిగా తమ్మిరెడ్డి దామోదర్, ఉపాధ్యక్షులుగా ఎన్. జగదీష్‌ను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అంగన్వాడీ చిన్నారుల ఇళ్లకు అధికారులు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని సోలికిరి, లివిరి గ్రామాల్లో అంగన్వాడీలో నమోదైన పిల్లల ఇళ్లకు ఐసిడిఎస్ పిఒ టి.విమలరాణి బుధవారం వెళ్లి, పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లల బరువు, మానసిక ఎదుగుదల తెలిపే అంశాలు, అంగన్వాడీలో సహాయకులు అందిస్తున్న పోషకాలు, దశల వారీగా వేస్తున్న టీకాలు, రక్తహీనత సంబంధిత అంశాలపై తల్లిదండ్రులు అడిగి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. అనంతరం అంగన్వాడీలో రికార్డులను, పిల్లలకు అందిస్తున్న పోషకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గురిబిల్లి సుప్ర, అంగన్వాడీ సహాయకులు పాల్గొన్నారు.

ఐటిఐలో స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఉపాధి అవకాశాల కోసం స్వల్పకాలిక కోర్సులను ప్రారంభిస్తున్నట్లు భద్రగిరి ఐటిఐ ప్రిన్సిపల్ సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌసల్య వికాస యోజన సౌజన్యంతో ఉపాధి అవకాశాలు ఉన్న అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఫాబ్రికేషన్ టెక్నీషియన్ కోర్సులకు భద్రగిరి ఐటిఐలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మూడు నెలల కాల పరిమితి గల ఈ కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. 18 ఏళ్లు నిండి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలతో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 79813 08986, 63040 86821 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - బాడంగి

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎఎంవి ఇన్‌స్పెక్టర్ ఐశ్వర్య లక్ష్మి కోరారు. స్థానిక ప్రధాన కూడలిలో ఆమె బుధవారం వాహనాలను తనికీ చేసి పలు సూచనలు చేశారు. బాడంగి ఎస్ఐ ఆర్ జయంతితో పాటు 4 మండలాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా ట్రాఫిక్ సిగ్నల్స్ పై, వాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్, సీటు బెల్ట్ తప్ప సరిగా ధరించాలని, అధిక వేగంతో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని అన్నారు.

చలి వేంద్రం ప్రారంభం

విజయనగరం టౌన్ : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు నగరంలోని ఏంజెల్ ఎన్‌జిఒ ఆధ్వర్యాన ర్పాటు చేసిన చలివేంద్రాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి ఎండలకు వడ దెబ్బ తగల కుండా చల్లని నీరు, చల్లని మజ్జిగ. పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలు తీసుకొన్ని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాయుడు, ఆర్ఎం డాక్టర్ గౌరీశంకర్, ఏంజెల్ ఎన్‌జిఒ అధ్యక్షులు ఎంఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. మెప్మా సభ్యులు మజ్జిగ అందిస్తూ సహాయం చేశారు సమాచార శాఖలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ఆనంద్, ఆయన సోదరుడు గోపాల్ సహకారం అందించారు.

పాఠశాలల పరిశీలన

వేపాడ : మండలంలోని వావిలపాడు కస్తూరిబా బాలికల వసతి గృహం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేపాడ పాఠశాలలను ఎంఇఒ జి. శ్రీదేవి బుధవారం పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం, వర్క్ బుక్స్, ఉపాధ్యాయులు విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. కార్యక్రమంలో సిసిఆర్‌పి లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు వల్లి, కెజిబివి ఎస్ఒ కిరణ్మయి పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం



వీరఘట్టం.. పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరల్ కమర్

ప్రజాశక్తి-సీతంపేట

ఇంటర్మీడియట్ మొదటి ఏడాది పరీక్షలు బుధవారం సీతంపేటలోని బాల, బాలికల గురుకులాల్లోని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సీతంపేట బాలుర గురుకులంలో 226 మంది విద్యార్థులకు 225 మంది హాజరయ్యారు. ఈ కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ వి.మన్మథరావు తనిఖీ చేపట్టారు. గిరిజన బాలికల గురుకులంలో 86 మందికి 85 మంది హాజరయ్యారు. 157 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 154 మంది హాజరయ్యారు పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్ సూర్యకుమారి విశ్వనాథం పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు.



కురుపాం.. పరీక్షకు హాజరైన విద్యార్థులు

కురుపాం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 442 మంది విద్యార్థులకు గాను 414 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి హరికృష్ణ తెలిపారు.

జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రంలో 615 మందికి గాను 69 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శివప్రసాద్ తెలిపారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన ఏర్పాట్లతో కళాశాలలో పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాచిపెంట : మండలంలోని పాచిపెంట, పి.కోనవలస పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు బుధవారం 38 మంది గైర్హాజరయ్యారు. పాచిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 193 మందికి గాను 9 మంది, పి.కోనవలస బాలుర కళాశాలలో 331 మందికి 29 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను డిఒలు జి.శ్రీనివాసరావు, జగన్మోహనరావు, చీఫ్ సూపరింటెండెంట్లు ఎల్.ప్రశాంత్, లఅప్పలనాయుడు పర్యవేక్షించారు.

వీరఘట్టం : మండలంలో నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షకు 269 మందికి గాను 15 మంది గైర్హాజరైనట్లు సిఎస్ పి.శంకరరావు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. ఎస్ఐ ఎం.హరికష్ణ పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని భద్రగిరి పిటిజి గురుకుల బాలికల కళాశాల పరీక్షా కేంద్రంలో 299 మంది విద్యార్థులకు గాను 279, ఎపి ఆర్ఎస్ గురుకుల కళాశాలలో 404 మందికి 357 మంది, గుమ్మలక్ష్మీపురం జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 424 మందికి 380 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్స్ సుధాకర్, భారతి, సత్యవతి తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ పరిశీలించారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు ఉన్నారు.

మక్కువ : మండలంలో నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షలకు మొత్తం 466 మందికి గాను 427 మంది హాజరయ్యారు.

రూరల్ కార్యాలయంలోనే సిడిపిఒ ఆఫీసు

వినతిపత్రం అందజేసిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-సాలూరు

ఐసిడిఎస్ అర్బన్, రూరల్ ప్రాజెక్టుల విలీనం తర్వాత సిడిపిఒ కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న ఐసిడిఎస్ రూరల్ కార్యాలయంలోనే నిర్వహించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యాన రూరల్ ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఏజెన్సీలో 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న మారుమూల గిరిజన గ్రామాలకు వెంకటేశ్వరా కాలనీలో ఉన్న సిడిపిఒ కార్యాలయమే అందుబాటులో ఉంటుందన్నారు. అర్బన్ ప్రాజెక్టు కార్యాలయమైతే ఏజెన్సీ ప్రాంత అంగన్వాడీ కార్యకర్తలకు దూరం పెరుగుతుందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంత అంగన్వాడీ కార్యకర్తల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి ప్రాజెక్టుల కార్యాలయంగా రూరల్ ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయాన్ని నడపాలని కోరారు. దీని కోసం ఈనెల 16న ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 20న విజయవాడలో జరిగే ధర్నాకు హాజరయ్యేందుకు సెలవు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎ.నారాయణమ్మ, తిరుపతమ్మ, డి.పార్వతి, సుజాత పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకులు

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు కె.ఈశ్వరరావు

ప్రజాశక్తి-పాచిపెంట

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు. పాచిపెంటలో బుధవారం సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రామిక మహిళా నాయకులు టి.ప్రభావతి అధ్యక్షతన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో కార్మిక వర్గానికి, ఉద్యోగులకు, రైతాంగానికి ఎటువంటి ప్రయోజనమూ లేదన్నారు.

అంబానీ, అదానీ, కార్పొరేట్ కంపెనీలు లబ్ధిపొందుతున్నట్లు చెప్పారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కి దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని విమర్శించారు. విభజన హామీలను నెరవేర్చలేదన్నారు. వీటన్నింటిపైనా చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుర్రు రామారావు, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు సూకురు అప్పలస్వామి, సిఐటియు మండల నాయకులు చింత పోలిరాజు, ఐద్వా నాయకులు కోరాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుడే రారాజు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

న్యాయమైన వ్యాపారం... నాణ్యమైన వస్తు సేవలు అందిన రోజు వినియోగదారుడే రాజు అవుతాడని వినియోగదారుల హక్కుల రక్షణ ఫోరం ప్రతినిధులు అన్నారు. బుధవారం పార్వతీపురం పట్టణంలోని శ్రీవారి సన్నిధి కళ్యాణమండపంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని ఆ ఫోరం ప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా మన్యం జిల్లా అధ్యక్షులుగా నియమించిన చందక అనిల్‌కుమార్‌ను సన్మానించారు. అనంతరం వినియోగదారుడా మేలుకో... అనే కరపత్రాన్ని, స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులు మోసపోకుండా హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. వ్యాపార సంస్థల యజమానులకు కూడా దీనిపై చైతన్యం కలిగిస్తామన్నారు అనంతరం పట్టణ మెయిన్ రోడ్డులో ర్యాలీ చేపట్టారు. ప్రతినిధులు చందక అనిల్ కుమార్, జామి శ్రీనివాసరావు, వంగల దాలినాయుడు, పాటి శ్రీనివాసరావు, కొత్త సన్యాసిరాజు, బంకురు ప్రకాశ్‌రావు, పొట్నూరు పైడిరాజు, నెయ్యి గాపుల సురేష్, ఎం.తవిటినాయుడు, వై.శ్రీనివాస్ నాయుడు, పొట్నూరు రేవంత్ కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఫోరం ప్రతినిధులు

నేడు మద్యం దుకాణాలు మూసివేత

ప్రజాశక్తి-కలెక్టరేట్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం చేపడుతున్న దృష్ట్యా జిల్లాలో మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్ 135సి, ఎపి ఎక్సైజ్ చట్టం సెక్షన్ 20(1) కింద మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలలో విక్రయాలు చేపట్టకుండా మూసివేస్తున్నట్లు వివరించారు. లెక్కింపు ప్రక్రియ పూర్తి అయ్యే వరకు మూసివేత కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ దీనిని విధిగా అమలు చేసి ఎన్నికల లెక్కింపు సజావుగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

పక్కాగా చిన్నారులకు టీకాలు

ప్రజాశక్తి-సీతానగరం

నిర్దేశించిన తేదీలో చిన్నారులకు టీకాలు పక్కాగా వైద్య సిబ్బంది వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలో బూర్జ, పెదంకలాం గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహించిన సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పర్యవేక్షించారు. టీకాల కోసం వచ్చిన చిన్నారుల టీకా నిర్వహణ కార్డుల్లో గడువు తేదీలను పరిశీలించారు. వైద్య సిబ్బందికి తప్పనిసరిగా టీకా గడువు తేదీలను చిన్నారుల తల్లిదండ్రులకు తెలియజేసి, నిర్దేశించిన తేదీలో వేయాలని చెప్పారు. వేస్తున్న ప్రతి టీకా ఆవశ్యకతను వివరించాలని సూచించారు. వివరాలను నమోదు చేసి అదే రోజు ఆన్‌లైన్ చేయాలన్నారు. అత్యవసర మందుల కిట్‌ను అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాల్లో టీకా కార్యక్రమాన్ని అందుబాటులో ఉండేలా నిర్ణీత ప్రదేశాల్లోనే నిర్వహించాలని సూచించారు. వేసవికాలంలో చిన్నారుల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిఐఒ వివరించారు. ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.వరలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా పట్టివేత

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో దీసరగూడ గ్రామంలో బుధవారం సవర సుధాకర్ పది లీటర్ల సారా తీసుకొస్తుండగా ఎస్ఐ ఎ.నీలకంఠ రావు మాటు వేసి పట్టుకున్నారు. సవర సుధాకర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. సారా విక్రయిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలోని ఎల్ఎల్‌పురం గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాథులు బుధవారం సందర్శించారు. సిబ్బంది హాజరుపట్టికతోపాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి, వేతన దారులతో మాట్లాడారు. సమయపాలన పాటించి పనులకు హాజరుకావాలని సూచించారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు వేతనం పొందాలని కోరారు.

బంగారమ్మపేటలో వాటర్ స్కీమ్ ధ్వంసం

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీ పరిధిలో 25వ వార్డు బంగారమ్మపేటలో ప్రజలందరికీ ఉపయోగపడే పైలెట్ వాటర్ స్కీమ్‌ని కొంతమంది దుండగులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. వాటర్ స్కీమ్ వాడుకలో ఉంటే తమకు ఆటంకంగా ఉంటుందని భావించి సమీపంలో ఉన్న గ్రామస్తులే ధ్వంసం చేసి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్‌టి బాలుర పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌కి సమీపంలో ఉన్న పైలట్ వాటర్ స్కీమ్‌ని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. బుధవారం తెల్లారేసరికి పైలట్ వాటర్ స్కీమ్ ధ్వంసమై కనిపించడంతో కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు సహా పలువురు అవాక్కయ్యారు. దీనిపై టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు తెలిపారు.

17 నుంచి గుమ్మలక్ష్మీపురంలో యాత్ర

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కైలాసనాథస్వామి దేవాలయ 40వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17 నుంచి గుమ్మలక్ష్మీపురం గ్రామంలో ఐదు రోజుల పాటు యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యాత్ర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, సర్కస్, మ్యూజియం వంటి వినోద కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఐదు రోజులపాటు యాత్ర సందర్భంగా ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. యాత్ర ఏర్పాట్లను సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు పరిశీలించారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొత్తకోట విష్ణు, మాజీ సర్పంచ్, దోస్త్ మేరా దోస్త్ అధ్యక్షులు పాలక ప్రేమానంద్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్.సురేష్, పూజారి రాము, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ



కుక్కల దాడిలో మృతిచెందిన మేకలు

కుక్కల దాడిలో 20 మేకలు మృతి

ప్రజాశక్తి-రేగిడి

ండలంలోని సంకిలి గ్రామం గొల్ల వీధికి చెందిన నాగళ్ళ అప్పన్నకు చెందిన 20 మేకలు బుధవారం కుక్కల దాడిలో మతి చెందాయి. వీటిలో పది మేకలు పెద్దవి, మరో 10 మేకలు చిన్నవి ఉన్నాయి. దీంతో సుమారు మూడు లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశారు. మేకల శాలలోకి గుంపులుగా వచ్చిన కుక్కలు మేకలపై దాడి చేశాయి. పట్టపగలే కుక్కలు దాడి చేసి మేకలను చంపేయడంతో ఆకుటుంబం కన్నీరుమున్నీరైంది. వైసిపి నాయకుడు మజ్జి శ్రీనివాసరావు వెళ్లి పరిశీలించారు. అధికారులు నష్ట పరిహారం ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.